www.prajapakasham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 15 | నవంబర్ | 2025
పేజీలు : 8

## ఎంఈవోపై ఉపాధ్యాయుని దాడి

-పోలీసులకు ఫిర్యాదు



**ప్రజాపక్షం/ ఇల్లందు :** మండల విద్యాశాఖాధికారి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిపై అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు దాడి చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సుభాష్ నగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్ ఇల్లందు మండల విద్యా శాఖాధికారిగా కూడా వ్యవహరిస్తున్నారు. శుక్రవారం సుభాష్ నగర్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న శంకర్ అనే ఉపాధ్యాయుడు హాజరు పట్టికలో ఉదయం పూట సంతకం చేయడంతో పాటు సాయంత్రం చేయాల్సిన సంతకం కూడా ఉదయమే చేయడంతో ప్రధానోపాధ్యాయునిగా ఉన్న ఉమాశంకర్ ప్రశ్నించాడు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం సరి కాదని శంకర్‌కు సూచించడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. నువ్వు నాకు చెప్పేది ఏమిటంటూ అసభ్య పదజాలంతో ఉమాశంకర్‌ను

మిగతా 2లో..

## చరిత్రలో నిలిచిపోయేలా

# ప్రదర్శన, సభ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం జిల్లా చరిత్రలో నిలిచిపోయేలా డిసెంబర్ 26న సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. వందేళ్ల పోరాట చరిత్రను, సాధించిన విజయాలను నేటి తరానికి తెలియజేయడంతో పాటు పెరుగుతున్న కమ్యూనిస్టుల అవసరానికి అనుగుణంగా భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. జన సేవాదళ్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సిపిఐ ఖానాపురం హవేలీ శాఖ ఆధ్వర్యంలో లకారం ట్యాంక్‌బండ్‌పై జరుగుతున్న శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ డిసెంబర్ 26న జరిగే ప్రదర్శనలో

మిగతా 2లో..

-10 లక్షల మందికి శతాబ్ది ఉత్సవ సందేశం
-జన సేవాదళ్ శిక్షణ ప్రారంభ సభలో బాగం

## ప్రజల అవసరాలకనుగుణంగా అభివృద్ధి

-సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టండి
-అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈర్లపుడి ఎస్సి కాలనీలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లుకు, పంగిడి ఎస్సి కాలనీలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్డునిర్మాణ పనులకు అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. మంత్రి గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్రాగునీరు, విద్యుత్ సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు

మిగతా 2లో..

## ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ



-ప్రధాన జంక్షన్ వద్ద గో స్లో వైట్ పెయింట్
-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

మిగతా 2లో..

## ఘనంగా ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు

- జ్యోతి ప్రజ్వలన చేసిన కలెక్టర్
- అలరించిన చిన్నారుల ఆటపాటలు

2 లో



## పద్నాలుగేళ్లయినా పనులు పూర్తికాలే..!



అదనపు నిధులొచ్చి ఐదు నెలలు

సెంటర్ స్ప్రెడ్

## వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో

# ఏసిబి అధికారుల తనిఖీలు

డాక్యుమెంట్ రైటర్లపై విచారణ

**ప్రజాపక్షం/వైరా:** వైరా సబ్ రిజిస్టార్ కార్యాలయం నందు శుక్రవారం ఏసిబి డిఎస్‌పి వై.రమేష్ ఆధ్వర్యంలో సిఐ శేఖర్‌తో పాటు సుమారు పది మంది అధికారులు తనిఖీలు నిర్వహించారు. సబ్ రిజిస్టార్ కార్యాలయానికి వచ్చిన ఏసిబి అధికారులు డాక్యుమెంటర్ రైటర్ల గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు డాక్యుమెంట్ రైటర్ల సెల్‌ఫోన్‌లు వారు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసిబి డిఎస్పి రమేష్ మాట్లాడుతూ

మిగతా 2లో..



# చరిత్రలో నిలిచిపోయేలా ప్రదర్శన, సభ

(మొదటిపేజీ తరువాయి)



10 వేల మంది యువ కమ్యూనిస్టులు, జన సేవా దళ్ కార్యకర్తలు కదం తొక్కనున్నట్లు ఆయన తెలిపారు. ఇందు కొరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 10 వేల మందికి శిక్షణ ఇస్తున్నామని హేమంతరావు తెలిపారు. ఇప్పటికే శతాబ్ది ఉత్సవ ముగింపు సభ ప్రచారం సాగుతుందని ఈ నెల 21న రాష్ట్ర స్థాయి జాతా, ఖమ్మంజిల్లాలో పర్యటించనుందని హేమంతరావు తెలిపారు. సూర్యాపేట జిల్లా నుంచి 21న నేలకొండపల్లిలోకి ప్రవేశిస్తుందని నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం, కొణిజర్ల, వైరా, తల్లాడ, ఏన్కూరు మీదుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. జన జాగృతిలో భాగంగా ఖమ్మంజిల్లాలోనూ కమ్యూనిస్టు పార్టీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మూడు జాతాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వందేళ్లలో కమ్యూనిస్టు పార్టీ సాధించిన విజయాలను నేటి తరానికి తెలియజేయడంతో పాటు పెరుగుతున్న కమ్యూనిస్టుల అవసరాలకు అనుగుణంగా యువతరాన్ని కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షించేందుకు 10 లక్షల మందికి మహాసభ సందేశాన్ని అందించేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ డిసెంబర్ మొదటి వారం నుంచి ప్రారంభమవుతుందని హేమంతరావు తెలిపారు. శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక కళా రూపాలను రూపొందిస్తున్నామని తెలిపారు. సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించడంతో పాటు ప్రత్యేకంగా వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రపై కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసి అమరులైన వారితో పాటు సాయుధ తెలంగాణ పోరాట కాలంలో అశువులు బాసిన అమరుల చరిత్ర ప్రతిభింభించేలా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. శిక్షణ శిబిరానికి శిక్షకులుగా రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్ వ్యవహరించగా ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, నగర కార్యదర్శి ఎస్కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ నాయకులు మామిళ్ల శ్రీనాథ్, మద్దోజు శ్రవణ్, చింతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి అధికారుల తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

వైరా సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌పై గత కొన్ని రోజులుగా పలు అవినీతి ఆరోపణలు వినిపిస్తున్న నేపధ్యంలో ఏసిబి డిజిపి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించడం జరిగిందని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో పనిచేస్తున్న డాక్యుమెంటర్ రైటర్ల ఫోన్ ట్రాన్సక్షన్ పరిశీలిస్తున్నామని అదేవిధంగా రికార్డులు కూడా పూర్తిస్థాయిలో పరిశీలించడం జరుగుతుంది. దానికి సంబంధించిన నివేదికను పై అధికారులకు పంపించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అయితే డాక్యుమెంట్ రైటర్ మందడపు రామారావు వద్ద ఉన్న డబ్బులు ఆయన వ్యక్తిగతమని బ్యాంకు నుండి డ్రా చేశారు. ఎవరికో ఇవ్వడానికి తీసుకొచ్చాడు అని ఆ డబ్బులకి ఎలాంటి సంబంధం లేదని ఆయన తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల అధికారులు సిబ్బంది ఎవరు లంచం అడిగినా వెంటనే తమ శాఖకు సమాచారం అందివ్వాలని కోరారు. చాలామంది బాధితులు లంచం అడిగిన వారి సమాచారం ఇస్తే కార్యాలయంలో తనకు కావాల్సిన పనులు కావని చేయరేమో అనే అపోహలు భయాలు వ్యక్తం చేస్తున్నారని, అలాంటి భయాలు అవసరం లేకుండా కార్యాలయ నిబంధనల మేరకు అన్ని పనులు అవుతాయని చెప్పారు. 24/7 మా టోల్ ఫ్రీ నెంబర్ 1064 కాల్ చేయాలని కోరారు. కార్యాలయంలో గాని, డాక్యుమెంట్ కన్సల్టెంట్ గాని అక్రమాలకు పాల్పడినట్లు తేలితే ప్రెస్‌కు మరలా వివరిస్తామని ఏసి ఏసిబి డిఎస్‌పి రమేష్ తెలిపారు. కాగా కొద్ది నెలలుగా వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏ ఆరోపణలు లేకుండా ప్రశాంతంగా ఉందనుకుంటున్న సమయంలో ఏసిబి ఆకస్మిక సోదాలు జరగడం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తీరు మారలేదని భావించాలో గత మూడేళ్లుగా అవినీతి అక్రమాలు జరిగిన సబ్ రిజిస్ట్రార్‌ల సస్పెన్షన్‌లు ఆకస్మిక బదిలీలు జరిగి అసలు కార్యాలయాన్నే వైరా నుంచి మారుస్తారనే పుకార్లు కూడా వచ్చాయి. దున్నే రోజుల్లో దూరదేశం వెళ్లి ఈత రోజుల్లోనే కొత్త కొచ్చినట్లు ఏసిబి అధికారులు అప్పటి ఆరోపణలపై ఇప్పుడు వచ్చారా అన్న సందేహాలు కూడా వస్తున్నాయి. అయితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్న సమయంలో అధికారులు ఎక్కడ ప్రజలు అంతరాయం కలగకుండా రిజిస్ట్రేషన్ సక్రమంగా చేసే విధంగా చేశారు.

# ఘనంగా ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం స్థానిక గ్రంథాలయ ఆవరణలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చాచా నెహ్రు, గ్రంధాలయ పితమహుడు ఎస్ఆర్ రంగనాధన్‌ల చిత్రపటానికి చైర్మన్ వీరబాబుతో కలిసి పూల మాలలు వేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంధాలయాలు తాము చదువుకునే రోజుల్లో ఎంతగానే ఉపయోగపడేవని, ఇలాంటి మౌళిక సదుపాయులు అప్పట్లో లేవన్నారు. గ్రంధాలయాల్లో లభ్యమయ్యే పుస్తకాలతో విద్యార్థినీ విద్యార్థులు జ్ఞానాన్ని సంపాదించుకోవాలని, ఇంటర్‌నెట్‌లు, వైఫైల కంటే పుస్తక జ్ఞానం చాలా ముఖ్యమని చెప్పారు. పుస్తకాలు చదవడం నిత్య జీవితంలో ఎవరికైతే అలవాటు ఉంటుందో వారి జీవితంలో చక్కటి మార్పులు చోటు చేసుకుంటాయని చెప్పారు. గ్రంధాలయాలకు కావాల్సిన మౌళిక సదుపాయాల కోసం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. వారోత్సవాల సందర్భంగా మొదిటి రోజున చిన్నారుల ఆట పాటలు పలువురుని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆఫీస్ ఇంచార్జ్ నవీన్, గ్రంధపాలకురాలు గుమ్మడి మణిమృధుల, శాఖ గ్రంధపాలకులు మధుబాబు, వాణి, రుక్మిణితో పాటు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్ధినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నరు.

# చిత్తడి నేలల పరిరక్షణకు కృషి

**అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**



**ప్రజాపక్షం/చింతకాని :** చిత్తడి నేలలు గుర్తించి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. చింతకాని మండలం మత్కేపల్లి తుమ్మలమ్మ చెరువును వెట్ ల్యాండ్ కమిటీతో కలిసి అదనపు కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తడి నేలలు గుర్తించడం ద్వారా భూమి యాజమాన్యం ఎట్టి పరిస్థితుల్లో మారదని, రైతులు, భూయజమానులు ఎవరూ అనవసర ఆందోళన చెందాల్సిన అవసరం లుదని స్పష్టం చేశారు. చిత్తడి నేలల్లో పరిమితులు మాత్రమే అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ భూముల సంరక్షణ కోసం 2017లో ప్రభుత్వం కొన్ని నిబంధనలు ప్రవేశపెట్టిందన్నారు.చింతకాని మండలాన్ని ఫైలెట్ క్రింద ఎంపిక చేసి ముందస్తుగా చిత్తడి నేలలు గుర్తించి అక్కడ పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాలనిఅన్నారు. చిత్తడి నేలల్లో అనేక రకాల మొక్కలు, పక్షులు జంతువులు ఆవాసాలను ఏర్పరచుకుంటాయని అన్నారు. తడి భూములను రక్షించేందుకు కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. అసందర్భంగా చెరువు మ్యాప్, సరిహద్దులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి వెంకట్రామ్, చింతకాని తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు సంబంధిత అధికారలు పాల్గొన్నారు.

# ఎంఈవోపై ఉపాధ్యాయుని దాడి

(మొదటిపేజీ తరువాయి)

దూషించడంతో పాటు కర్రతో దాడి చేశాడు. శంకర్ దాడిలో ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్ కిందపడగా కిందపడిన వ్యక్తిపై మరోసారి దాడి చేసేందుకు ప్రయత్నించడంతో సిబ్బంది అడ్డుకున్నారు. ఉమా శంకర్‌ను వైద్య చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రధానోపాధ్యాయునిపై ఉపాధ్యాయుడు దాడి చేసిన ఘటన సంచలనం సృష్టించింది. ఉమాశంకర్ పోలీసులకు, జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజల అవసరాలకనుగుణంగా అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఇండ్లపై వెళ్తున్న విద్యుత్ తీగల తరలింపుకు కార్యాచరణ చేయాలన్నారు. నియోజకవర్గ పరిధిలో ఇంకా ఎన్ని ఎక్స్టెన్షన్ స్తంభాలు అవసరం ఉన్నవి నివేదిక సమర్పించాలన్నారు. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు ఉన్న రైతులకు ప్రభుత్వ ఫలాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టిసారించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, జిల్లా వ్యవసాయ అధికారి జి. పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, ఆర్ అండ్‌బి ఎస్ఈ యాకూబ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ఖమ్మం ఆర్డివో జి. నర్సింహారావు, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, డిఎల్‌పివో రాంబాబు, పంచాయతీరాజ్ ఈఈ మహేష్‌బాబు, ఎంపిడివో అశోక్‌కుమార్, తహసీల్దార్ శ్వేత, నాయకులు దీపక్ నాయక్, దేవీలాల్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

(మొదటిపేజీ తరువాయి)


ఖమ్మం నగర పరిధిలో ఆర్అండ్‌బి, మున్సిపల్ రోడ్ల నిర్వహణ, మరమ్మతు పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న 20 బ్లాక్ స్పాట్‌లు గుర్తించి అక్కడ స్పీడ్ కంట్రోల్‌కు రంబుల్ స్ట్రిప్స్, సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లపై లైన్ మార్కింగ్ ఉండేలా చూడాలన్నారు. నగరంలో ప్రధాన జంక్షన్ల వద్ద రోడ్డుపై గో స్లో వైట్ పెయింట్ వేయాలన్నారు. ఐరాడ్ (ఇంటిగ్రేటెడ్ రోడ్డు యాక్సిడెంట్ డిటెక్షన్ సెంటర్) వంటివి పరిశీలించి ప్రమాదాల నియంత్రణకు కార్యచరణ సిద్దం చేయాలన్నారు. బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నియంత్రణకు పటిష్ట కార్యాచరణ సిద్ధం చేసి నెల రోజుల్లో మార్పు చూపించాలన్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో దానవాయిగూడెంలో మరమ్మతు పనులకు సంబంధించి రూ.3.50 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందని అట్టి నిధులతో టిజిఎస్‌డబ్ల్యూఆర్, పాఠశాల, కళాశాలకు కాంపౌండ్ వాల్, ల్యాండ్ ఫిల్లింగ్, జనరేటర్, క్రీడా వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్‌బి ఎస్ఈ యాకూబ్, ఈఈ పవర్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, విద్యాశాఖ ఈఈ బుగ్గయ్య, మున్సిపల్ డిఈ ధరణి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# న్యూవిజన్ పాఠశాలలో నెహ్రూ జయంతి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని న్యూ విజన్ పాఠశాలలో నెహ్రూ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అబాద్‌అలీ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సిహెచ్ కార్తీక్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన స్వయం పాలక దినోత్సవంలో చిన్నారులు రంగు రంగుల దుస్తులతో అలరించారు. పాఠశాలకు చెందిన కొందరు చిన్నారులు నెహ్రూ వేషధారణతో అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల అకాడమీక్ డైరెక్టర్స్ సిహెచ్ కార్తీక్, పి. స్ఫూర్తి, ఉపాధ్యాయ బృందం, చిన్నారులు పాల్గొన్నారు.

# హార్వెస్ట్‌లో ఘనంగా బాలల దినోత్సవం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో మాజీ ప్రధాని నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు హార్వెస్ట్ పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పే ప్రతి విషయాన్ని జాగ్రత్తగా వినడం ద్వారా మాత్రమే విషయాల పట్ల అవగాహన మెరుగుపర్చుకోవచ్చునని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులుగా మారి ఆరవ తరగతి, పదవ తరగతి పాఠాలు బోధించారు. తమకిష్టమైన సబ్జెక్టులలో కసరత్తు చేసి పిల్లలకు అద్భుతంగా బోధించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా విజయోత్సవ సంబరాలు



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండల కేంద్రంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించి, ఎమ్మెల్యే గా ప్రజా ఆశీస్సులు పొందడాన్ని పురస్కరించుకొని కరకగూడెం మండల కాంగ్రెస్ యంత్రాంగం హర్షం వ్యక్తం చేస్తూ, బైక్ ర్యాలీ నిర్వహించి, బాణసంచా కాల్చి ఘనంగా విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలోమాజీ ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్ సాగుతో అధిక లాభాలు



**-పొలం బాట పట్టిన మంత్రి తుమ్మల**

**-రజబ్‌అలీ నగర్‌లో పొలాలను సందర్శించిన మంత్రి తుమ్మల**

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** పత్తి, మొక్కజొన్న సాగుకు బదులు పామాయిల్ సాగుతో రైతులకు అధిక లాభాలు పొందవచ్చునని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. శుక్రవారం రఘునాథపాలెం మండలంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించిన సందర్భంగా మార్గ మధ్యలో రజబ్‌అలీ నగర్ గ్రామంలో పొలాలను సందర్శించారు. బానోత్ వీరన్న విజయలకు చెందిన పొలాల వద్దకు వెళ్లి ఏ పంట వేస్తున్నది, గతంలో ఎంత దిగుబడి వచ్చింది అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పత్తి, మొక్కజొన్న పంటలకు ప్రత్యామ్నాయంగా పామాయిల్ సాగు చేపట్టాలని రైతులకు మంత్రి సూచించారు. పామాయిల్ సాగులో తక్కువ పెట్టుబడితో పాటు దీర్ఘకాలిక లాభాలు ఉంటాయన్నారు. మొక్కలు, డ్రిప్ పరికరాలు, ఎరువులకు సంబంధించి సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందన్నారు. అకాల వర్షాలు, చీడ పీడలు, కోతులు, అడవి పందులతో ఇబ్బందులు ఉండవన్నారు. మందుల ఖర్చు కూడా తక్కువేనని తెలిపారు. పామాయిల్ సాగుకు మంచి డిమాండ్ ఉందని పండిన పంటకు మార్కెటింగ్‌కు ఎటువంటి సమస్యలు లేవన్నారు. గ్రామాల్లోని నాయకులు, ఉద్యావన శాఖాధికారులు పామాయిల్ సాగును ప్రోత్సహించేలా తగు చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వర రావు, అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, ఆర్డీవో జి. నర్సింహారావు, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధికి బాటలు వేసిన మార్గదర్శి నెహ్రూ

**-నెహ్రూకు నివాళులర్పించిన మంత్రి తుమ్మల**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దేశాభివృద్ధికి బాటలు వేసిన మార్గదర్శి జవహర్‌లాల్ నెహ్రూ అని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా శుక్రవారం కాల్వొడ్డులో గల నెహ్రూ విగ్రహానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాళులర్పించారు. అదేవిధంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నెహ్రూ చిత్ర పటానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ భారత తొలి ప్రధాని, దివంగత జవహర్‌లాల్ నెహ్రూ దేశాభివృద్ధికి బాటలు వేశారన్నారు. నెహ్రూ వారసులుగా ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశ ప్రగతిలో తమదైన ముద్ర వేశారన్నారు. దేశం లౌకిక విధానంలో అన్నదమ్ముల్లా కలిసి జీవించేలా నెహ్రూ చెరగని ముద్ర వేశారన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్ చౌదరి, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో బిల్డ్ నౌ వెబ్‌సైట్

**గంటలో వైరా మున్సిపాలిటీలో ఇంటి నిర్మాణ అనుమతి**

**మున్సిపల్ కమిషనర్ గురులింగం, టౌన్ ప్లానింగ్ అధికారి భాస్కర్**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో గండగలపాడు వార్డు మెంబర్ 10లో ఇంటి నిర్మాణం అనుమతి కోసం బిల్డ్ నౌ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న కాటి కృష్ణ అనే దరఖాస్తుదారులు మున్సిపాల్ కమీషనర్ ఉప్పల గురులింగంను సంప్రదించగా, టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికాల భాస్కర్‌తోకలిసి ఇళ్లు నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. వెంటనే ఆన్‌లైన్‌లో ఉన్న అతని దరఖాస్తును డాక్యుమెంట్స్‌ను పరిశీలించి చెల్లించిన ఫీస్‌ను సరిచూసుకొని వెంటనే అనుమతిని మంజూరు చేశారు. ఈ పరిశీలన అంతా గంటసేపులో పూర్తి చేశారు. గంటలోనే ఇంటి నిర్మాణ పర్మీషన్ ఇచ్చినందుకు దరఖాస్తుదారులు మున్సిపాల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణ అనుమతులు వేగంగా, పారదర్శకంగా ఇస్తున్నామని, బిల్లునవిలో అప్లై చేసుకున్న దరఖాస్తుల డాక్యుమెంట్లు సక్రంగా ఉంటే గంటలోనే అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేయవద్దని తెలిపారు. అనుమతి లేని నిర్మాణాలకు జరిమానాతో పాటు నిర్మాణాన్ని తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు.

# 17న వైరాలో కార్తీక దీపోత్సవం




**ప్రజాపక్షం/వైరా:** ఈ నెల17న సాయంత్రం 6.30 నిముషాలకు కార్తీక దామోదర ప్రీతిగ వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం కమ్మవారి కళ్యాణ మండపం వైరా నందు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో మ హిళా భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దామోదర అనుగ్రహం పొందగలరని కమ్మజన సేవా సమతి వైరాలో ప్రకటనలో తెలిపారు.

# బ్యాంక్ అభివృద్ధికి కృషి

**-డిసిసిబి ఛైర్మన్ దొండపాటి**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లా కేంద్ర సహకార అభివృద్ధికి కృషి చేస్తామని డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం డిసిసిబి ప్రధాన కార్యాలయం నందు 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు జెండాను ఆవిష్కరించారు. బ్యాంకు ఉద్యోగుల సహకారంతో బ్యాంకు బలోపేతానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ సహకార శిక్షణా కేంద్రం వరంగల్ వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, బ్యాంకు సిఈవో వెంకట ఆదిత్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహకార అధికారి శ్రీనివాస రావు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మిక్కిలినేని నరేందర్‌కు మాతృవియోగం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ నాయకులు, 54వ డివిజన్ కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల భర్త మిక్కిలినేని నరేందర్ మాతృమూర్తి మిక్కిలినేని ప్రమీలరాణి (71) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఖమ్మం వీడియోస్ కాలనీలోని వారి స్వగృహంలో ఉంచిన ఆమె భౌతికాయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో పాటు పలువురు ప్రముఖులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మిక్కిలినేని మంజుల, నరేందర్‌లను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, మానుకొండ రాధాకిషోర్, పలువురు కార్పొరేటర్లు, వివిసి సంస్థల అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, బిఆర్‌ఎస్ నాయకులు బత్తుల మురళి, టిఎన్‌జీవోస్ అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, ఖమ్మం టౌన్ ఏసిపి రమణమూర్తి, సిఐలు భానుప్రకాష్, కరుణాకర్, బాలకృష్ణ, ప్రముఖ వైద్యులు కూరపాటి ప్రదీప్‌కుమార్, మోపర్తి సుమంత్, గుమ్మడి రాఘువేంద్ర, ప్రముఖ వ్యాపారులు ధనాల ప్రసాద్, కురువెళ్ల ప్రవీణ్ నివాళులర్పించారు.

# కోర్టు భవన నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



**ప్రజాపక్షం/ మధిర :** నూతన కోర్టు భవన నిర్మాణాల్లో తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వరంగల్ సర్కిల్ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఇ మనోహర్, ఇఇ రమాదేవి తెలిపారు. రూ.24కోట్లతో నిర్మిస్తున్న మధిర కోర్టు భవనాల సముదాయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మ్యాపును, రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిర్ధేశించిన సమయంలో కోర్టు భవన నిర్మాణాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించి నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. క్యూరింగ్ తప్పనిసరిగా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఖమ్మం సబ్ డివిజన్ డిఇ సూరిబాబు, సత్తుపల్లి ఎఇఇ ఆర్.శ్రీనివాసరావు, ఆర్అండ్‌బి ఇఇ తానేశ్వర్, డిఇఇ శంకర్‌రావు, ఎఇఇ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జవహర్‌లాల్ నెహ్రూ జయంతి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారతదేశ తొలి ప్రధానిమంత్రి, భారతరత్న పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని చిన్నారులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంతో స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలకు పునాది వేశారని, దేశానికి కొత్త దిశను చూపించారని, నేటి ఆధునిక భారతదేశానికి ఆనాడే పునాది వేసిన తొలితరం కాంగ్రెస్ అధినాయకుడని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షులు మిరియాల రమణగుప్తా, జిల్లా నాయకులు పాటిబండ్ల సత్యంబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, దుంప వెంకటేశ్వరరెడ్డి, షేక్.జహంగీర్, కర్నాటి రామారావు, నిడమనూరి వంశీకృష్ణ, పత్తేపరపు సంగయ్య, పులిబండ్ల చిట్టిబాబు, బండారు నర్సింహారావు, దూదేకుల జాని తదితరుల పాల్గొన్నారు.

# నూతన డివిజన్ డిఇగా బండి బాధ్యతలు



**ప్రజాపక్షం/ మధిర :** విద్యుత్ శాఖ మధిర డివిజన్ కేంద్రంగా నూతనంగా ఏర్పడిన తరుణంలో ప్రథమ డివిజనల్ ఇంజనీర్‌గా బండి శ్రీనివాస రావు మధిర విద్యుత్ శాఖ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాలను అనుసంధానిస్తూ నూతనంగా మధిర డివిజన్ డిఇగా బాధ్యతలు చేపట్టిన బండి శ్రీనివాసరావును మధిర సబ్ డివిజన్ ఎడిఇ అనురాధ, విద్యుత్‌శాఖ సిబ్బందితో కలిసి ఘన స్వాగతం పలికారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన బండి శ్రీనివాసరావుకు ఖమ్మం టౌన్ డిఇ రామారావు, వైరా సబ్ డివిజన్ ఎడిఇ కిరణ్, ముదిగొండ ఎడిఇ సత్యనారాయణ, బోనకల్ ఎడిఇ ఆనంద్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాల అధికారులు, విద్యుత్‌శాఖ సిబ్బంది, వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# ఘనంగా బాలల దినోత్సవం

**ప్రజాపక్షం/మధిర :** మధిర పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్ హైస్కూల్ నందు బాలల దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి ప్రధాని, భారతరత్న జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ సబ్జెక్టుల్లో అత్యంత ప్రతిభ చూపి అధిక మార్కులు సాధించి ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందచేశారు. అనంతరం వివిధ రకాలైన నృత్యాలు, ఆట పాటలతో విద్యార్థులు అలరించి మెప్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సిస్టర్ ఆనియమ్మ, గ్రీన్‌హౌస్ టీచర్స్, హైస్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నవీన్ యాదవ్ గెలుపు పట్ల కట్ల హర్షం



**ప్రజాపక్షం/వైరా:** అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు కాంగ్రేస్ పార్టీ వైపు మొగ్గుచూపి కాంగ్రేస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించందనుకు జూబ్లీహిల్స్ ప్రజలకు కాంగ్రేస్ పార్టీ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రేస్ పార్టీ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిర్వహిస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పదం వైపు నడిపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలనకు జూబ్లీహిల్స్ ప్రజలు పట్టం కట్టారని, కాంగ్రేస్ పార్టీ కార్యకర్తలు , నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు ఎంతో కృషి చేశారని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇది కాంగ్రేస్ పార్టీ కార్యకర్తల విజయమని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజలు కాంగ్రేస్ పార్టీ అభ్యర్థులను సానుభూతిపరులను గెలిపించి రేవంత్‌రెడ్డి ప్రజా పరిపాలనకు పట్టం కట్టి వారికి మరింత బలం చేకూర్చాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## నవీన్ యాదవ్ గెలుపు పట్ల జవ్వాజి హర్షం



**ప్రజాపక్షం/వైరా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రేస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలవడం పట్ల వైరా మండలం తాటిపూడికి చెందిన కాంగ్రేస్ నాయకుడు యాదవ సంఘం మండల అధ్యక్షుడు జవ్వాజి నాగరాజు హర్షం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో పాటు రాష్ట్ర మంత్రివర్గానికి ప్రత్యేక కృతజ్ఞలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో యాదవులను గుర్తించి సముచిత స్థానం ఇచ్చినందుకు మాట నిలబెట్టుకున్న జూబ్లీహిల్స్ ఓటర్లకు ప్రతిఒక్కరికి పేరుపేరునా ఆయన ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా యాదవ సంఘం తరపున నవీన్‌యాదవ్‌కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతున్నానని జవ్వాజి నాగరాజు అన్నారు.

## మెకానిక్ షాపులు ప్రారంభించిన వీరంశెట్టి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 1వ వార్డు మెయిన్ రోడ్డు ప్రక్కన షేక్ రజబల్లి నూతనంగా ఏర్పాటు చేసిన ఆటో బైక్ మెకానిక్ షాపును గురువారం టౌన్ కాంగ్రేస్ నాయకులు వీరంశెట్టి సీతారాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రజల నమ్మకాన్ని పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు కాంగ్రేస్ అధ్యక్షులు బుడిగి వెంకన్న, 1వ వార్డు కాంగ్రేస్ పార్టీ ఉపాధ్యక్షులు దురిశెట్టి నర్సింహారావు, 1వ వార్డు కాంగ్రేస్ పార్టీ కార్యదర్శి మోరు శ్రీకాంత్, దుగ్గిరాల జాకోబు, లాలాపురం మాజీ సర్పంచ్ షేక్ సైదా, గాజుల మహేష్, షేక్ దర్గా, సయ్యద్ బాషా, జాని పాల్గొన్నారు.

## క్రాంతిలో ఘనంగా నెహ్రూ జయంతి




**ప్రజాపక్షం/వైరా:** స్థానిక ఠాగూర్ విద్యాసంస్థలైన క్రాంతి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, చైర్మన్ వాసిరెడ్డి సునీత, పండిట్ జవహార్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులను ఉద్దేశించి స్వతంత్ర భారతదేశానికి మొట్టమొదటి ప్రధాని పండిట్ జవహార్‌లాల్ నెహ్రూ అని, అనేక పుస్తకాలు రచించిన మహానీయుడని, అదేవిధంగా దేశంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టిన గొప్ప పరిపాలన దక్షుడని, వారికి బాలలు అంటే అమతమైన ప్రేమ కనుక వారి జన్మదిన పురస్కరించుకొని దేశంలో బాలల దినోత్సవం జరుపుకుంటారని, వారి స్పూర్తితో విద్యార్థులు పటిష్టమైనటువంటి భవిష్యత్తుని నిర్మించుకోవాలని ఆ విధంగా దేశ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లింగారావు, మజీద్, వేణు, నాగలక్ష్మి , చైతన్య, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## డీలర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎరువులు, పురుగు మందులు విత్తనాల డీలర్లు చట్టాలకు లోబడి పనిచేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.విజయచంద్ర అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మీనవోలు రైతు వేదికలో డీలర్లు, సొసైటీ సిఇఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను పిఓఎస్ మిషన్ ద్వానే అమ్మాలని ఏ రోజుకు ఆ రోజు స్టాక్ రిజిష్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రాబోయే యాసంగిలో రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎర్రుపాలెం మండల వ్యవసాయాధికారి బి.సాయిశివ, వ్యవసాయ విస్తరణాధికార్లు, డీలర్లు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

### -వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రెవెన్యూ భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను హెచ్చరించారు. రెవెన్యూ సదస్సు దరఖాస్తుల పరిష్కారంపై అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఉన్న భూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని, భూ భారతి దరఖాస్తులు, పెండింగ్ సాదాబైనామా, రెవెన్యూ సదస్సు దరఖాస్తులు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. గతంలో పలుమార్లు సమావేశాలు నిర్వహించి సూచనలు చేసినప్పటికీ కొన్ని మండలాల్లో ఆశించిన పురోగతి లేదన్నారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం కోరకు అధికారులు సెలవుల్లో కూడా పూర్తి స్థాయిలో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిశీలన వెంటనే ప్రారంభించాలని, డెస్క్ పరిశీలన ద్వారా అనర్హుల దరఖాస్తులను తిరస్కరించి ఆర్డివోకు ఫార్వర్డ్ చేయాలన్నారు. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న దరఖాస్తులకు జిపివో, ఆర్ఐ, సర్వేయర్ల ద్వారా క్షేత్ర పరిశీలన చేయాలన్నారు. సాదాబైనామా దరఖాస్తుల్లో అమ్మకం దారుల రికార్డు సరిగ్గా లేకపోతే తిరస్కరించాలన్నారు. ప్రభుత్వ భూములు, నాలాలు, చెరువులు, ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ పరిధిలో పట్టాల కోసం సాదాబైనామా దరఖాస్తులు వస్తే నేరుగా తిరస్కరించవచ్చునన్నారు. ప్రతి భూ సమస్య దరఖాస్తుకు సంబంధించి తిరస్కరిస్తే కారణాలు తెలియజేస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, వివిధ మండలాల తహసీల్దార్లు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పద్నాలుగేళ్లయినా పనులు పూర్తికాలే..!

### అదనపు నిధులొచ్చి ఐదు నెలలు





**ప్రజాపక్షం/చింతకాని :** నియోజకవర్గంలోని మహిళలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ప్రణాళికలు సిద్ధం చేస్తుంటే చింతకాని పంచాయతీరాజ్ అధికారుల నిర్లక్ష్యం చింతకాని శ్రీచెన్నకేశవ మండల మహిళా సమాఖ్య పట్ల శాపంగా మారుతుంది. మహిళాసమాఖ్య సభ్యుల సమావేశాలు నిర్వహణతో పాటు గ్రామీణ ఉపాధి హామీ పనుల కార్యకలాపాల నిర్వహణ కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 లక్షల వ్యయంతో మండల కేంద్రాల్లో స్త్రీ శక్తి భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా చింతకాని శ్రీచెన్నకేశవ మండల మహిళా సమాఖ్యకు నాటి అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి 24112011 న రామకృష్ణాపురం పర్యటనలో భాగంగా నియోజకవర్గంలో ని ఐదు మండలలాకు శంకుస్థాపన చేశారు.నాటి నుండి నేటి వరకు భవన నిర్మాణ పనులు పూర్తికాక చింతకాని మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరుపయోగంగా దర్శనమిస్తుంది. మహిళలు గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు విన్నవించినా భవనం వినియోగంలోకి తేలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళల ఆశలు మళ్లీ చిగురించాయి. ఇటీవల మేనెలలో మహిళా సమాఖ్య సభ్యులతో భట్టీ సమావేశం ఏర్పాటు చేయగా మహిళలు తమ భవన నిర్మాణ సమస్యపై వినతి పత్రం అందజేశారు. స్పందించిన భట్టీ వెంటనే కలెక్టర్‌ని భవన నిర్మాణ పనులు పూర్తిచేయించాలని ఆదేశించారు.

**తక్షణమే స్పందిచినా...**

భట్టి ఆదేశాలతో జూన్ 10వ తేదీన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చింతకాని మండల స్త్రీశక్తి భవన నిర్మాణాన్ని పరిశీలించి పనులు పూర్తిచేసేందుకు అక్కడికక్కడే రూ.5లక్షల చెక్కును స్థానిక ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావుకు అందజేసి నెలరోజుల్లో భవన నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ వచ్చి తమ భవన నిర్మాణానికి నిధులు ఇవ్వడంతో మహిళలు సంతోషపడ్డారు కానీ పంచాయతీ రాజ్ అధికారుల నిర్లక్ష్యం నేటి వరకూ పనులు ఇసంతా కూడా మొదలవలేదు. స్త్రీ శక్తి భవననిర్మాణ కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరితో పాత పనులు పూర్తికాకపోవడంతో కొత్తపనులు చేపట్టేందుకు అధికారులకు నిబంధనలు అడ్డంకిగా మారాయి. పాత కాంట్రాక్టర్ ని తొలగించి కొత్త కాంట్రాక్టర్‌కి పనులు అప్పగిస్తేనే భవన నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందని తక్షణమే అధికారులు కాంట్రాక్టర్‌ని తొలగించి కొత్తవారికి పనులు అప్పగించి త్వరితగతిన భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని మండల మహిళలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

**త్వరలో పనులు పూర్తిచేస్తాం : చుంచు శ్రీనివాసరావు(ఎంపీడీఓ, చింతకాని)**

ఈ అంశంపై ఎంపీడీఓ చుంచు శ్రీనివాసరావు ను ప్రజాపక్షం వివరణ కోరగాత్వరలోపనులుపూర్తిచేసిభవనాన్నివినియోగంలోకి తెస్తామన్నారు.

# బిర్సా ముండా జయంతి వేడుకలను విజయవంతం చేయండి

### - మంత్రి హాజరవుతున్నందున అధికారులు శ్రద్ద తీసుకోవాలి : ఐటిడిఏ పిఓ రాహుల్



**ప్రజాపక్షం/భద్రాచలం :** పిఎం ధర్తీ భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలు తెలంగాణ రాష్ట్ర పండుగగా ఐటిడిఏలో నిర్వహించనున్నందున, ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి, ప్రముఖులు హాజరువుతున్నందున విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఐటిడిఏ పిఓ రాహుల్ అన్నారు. శుక్రవారం ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన భవన్‌లో ఈనెల 15న బిర్సా ముండా జయంతి వేడుకలు గిరిజన దివస్ సమారోహము కార్యక్రమానికి చెందిన ముందస్తు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఆదివాసీ గిరిజన గ్రామాల్లో గిరిజన సంక్షేమం అభివృద్ధి కొరకు వివిధ రకాల పథకాలు ప్రవేశపెట్టిందని, దానిలో ధర్తీ అభయాన్ బిర్సా ముండా జయంతి వేడుకలు పురస్కరించుకుని పిఎం ధాత్రి అభజన్జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథఖం ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. ఈ పథకాన్ని ఉద్దేశించి ప్రధాని మోడి వర్చువల్ పద్దతిలో ప్రసంగిస్తారని, ఈ కార్యక్రమానికి వచ్చే అతిధులు మొదలుకుని గిరిజన ప్రజల వరకు విద్యార్థినీ విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల వసతి సౌకర్యాలతో పాటు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ రకాల సంక్షేమ పథకాలు గురించి ఛాయాచిత్ర ప్రదర్శనలు, ఎంఎస్ఎంఇయూ యూనిట్, జిసిసి స్టాల్, ఆదివాసీ గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు సంబంధించి విద్యార్థినీ విద్యార్థుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు, వైద్య ఆరోగ్య శాఖ మెడికల్ క్యాంపు ఉంటుందన్నారు. ఎంఎస్ఎంఇ యూనిట్ ద్వారా మంజూరైన వివిధ పథకాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని, ఆదికర్మయోగి ప్రతిపాదనలు అందరి సమక్ష్యంలో తీర్మాణం చేయించి ప్రభుత్వానికి పంపేవిధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, ఏఓ రాంబాబు, జిసిసి డిఎం సమ్మక్క, గురుకులం ఆర్‌సిఓ అరుణకుమారి, డిఇ హరీష్ రావు, సిడిఓ అలివేలు, మంగతాయారు, డిప్యుటీ డిఎంహెచ్ఓ చైతన్య, ఉదయ్ కుఆర్, ప్రభాకర్ రావు, హరికృష్ణ, ఆదినారాయణ, రమణయ్య, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయండి

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/చింతకాని :** డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ కు చింతకాని మండల వ్యాప్తంగా విరివిగా చందాలిచ్చి అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కొదుమూరు గ్రామంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్ముల మాట్లాడుతూ భారతదేశ గడ్డపై సిపిఐకి వందేండ్లన్నారు. దీనికి గుర్తుగా శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను నిర్వహిస్తున్నామని తెలిపారు.నాటి నుండి తాడిత , పీడిత ప్రజల కోసం ఎన్నో ప్రజాఉద్యమాలు నిర్వహించి పోరాటాలు చేసిన సిపిఐ కి చరిత్రలో తిరుగులేని స్థానం ఉందన్నారు. అనేక ప్రజా ఉద్యమాలను వందేండ్ల మహా ప్రస్థానంలో నిత్యం ప్రజాసమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐ సొంతమన్నారు.ఏ పార్టీకి లేని ఘన చరిత్ర సిపిఐ కి ఉందన్నారు. భూస్వాముల చెరనుండి లక్షలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచిపెట్టిన ఘన చరితను లిఖించుకున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు చింతకాని మండలం నుంచి అన్ని వర్గాల ప్రజలు అదిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కూచిపుడి రవి, పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, శాఖ కార్యదర్శి నిరుడు గోవిందరావు, మాజీ సర్పంచ్ నక్కనబోయిన సుజాత కృష్ణ, మాజీ ఎంపీటీసీ నారపోగు హేమ నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

# కూనంనేని ఆధ్వర్యంలో 16న మెగా జాబ్ మేళా

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** భద్రాద్రికొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సింగరేణి సంస్థ సౌజన్యంతో కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు సారధ్యంలో ఈ నెల 16న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సిపిఐ జూలూరుపాడు మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గుండెపిన్ని మాట్లాడుతూ 16న జరిగే జాబ్ మేళాలో 65 కంపెనీలకు పైగా పాల్గొననున్నాయని, మూడు వేలకు పైగా ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా జాబ్ మేళా నిర్వస్తున్నట్లు తెలిపారు. సంస్థ ద్వారా విడుదలైన క్యూ ఆర్ కోడ్ ద్వారా ఇప్పటి వరకు మూడు వేలమంది పైగా నిరుద్యోగులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. కొత్తగూడెం క్లబ్బులో ఉదయం 9 గంటల నుంచి ఐదు గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నారని, శిభిరంలో కూడా నమోదు ప్రక్రియ చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శిభిరాన్ని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభిస్తారని, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సింగరేణి అధికారులు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. జిల్లాతోపాటు ఇతర జిల్లా నిరుద్యోగ యువత కూడా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సిపిఐ, యువజన, విద్యార్థి, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు గుండెపిన్ని తెలిపారు.

# కారు ఇంజన్‌లో గంజాయి రవాణా



**ప్రజాపక్షం/పాల్వంచ :** గంజాయి రవాణా కొత్త పుంతలు తొక్కుతోంది. పోలీసుల నిఘాకు ఏమాత్రం అనుమానం రాకుండా ఎవరూ ఊహించని విధంగా గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని తరలిస్తున్నారు. తాజాగా కారు ఇంజన్‌లో గంజాయి పాకెట్లను తరలిస్తూ కాలం కలిసి రాకపోవటంతో దురదృష్టం వెంటాడటంతో అక్రమార్కులు కారును వదిలేసి పారిపోయిన సంఘటన మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే ఒడిసా రిజిస్ట్రేషన్ కలిగిన ఓ కారు ఇంజన్‌లో గంజాయి పాకెట్లను అమర్చి ఎటువంటి అనుమానం రాకుండా ఓ మహిళతో సహా ముగ్గురు వ్యక్తులు భద్రాచలం నుండి కొత్తగూడెంకు వైపునకు వెళుతున్నారు. ఈ క్రమంలో కారు ఇంజన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీనితో అక్రమార్కులు మంటలను అదుపు చేయటానికి పాల్వంచలోని ఓ వాటర్ ప్లాంటు వద్దకు కారును తీసుకొని వెళ్ళారు. కారు బానోట్ ఓపెన్ చేయగా ఇంజన్ వేడికి గంజాయి పాకెట్లు కాలిపోతున్నాయి. అందులో గంజాయి ఉన్నట్లు వాటర్ ప్లాటు సిబ్బంది గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీనితో స్మగ్లర్లు అక్కడ నుండి పారిపోయారు. సంఘటనా స్థలాని చేరుకొన్న పోలీసులు కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై పాల్వంచ పట్టణ ఎస్‌హెచ్‌ఓ సుమన్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరటానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

## శాంతి విద్యానికేతన్ పాఠశాలలో స్వయంపాలన దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** పండిట్ జవహర్లాల్ నెహ్రూ పుట్టిన రోజు పురస్కరించుకొని వివిధ పాఠశాలలో బాల బాలికల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలోని శాంతి విద్యానికేతన్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ మహిత ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో చిన్నారులు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయుల వేషధారణలో బోధనలు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ మండల కోప్రచార కమిటీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్ పాల్గొని విద్యార్థుల ప్రతిభను చూసి ఆశ్చర్యపోయాఉ. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాలల దినోత్సవ సందర్భంగా భారతదేశ మొదటి ప్రధాని చాచా నెహ్రూ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించిన అనంతరం నేటి బాలలే రేపటి పౌరులని దేశం సస్యశ్యామలంగా మెలగాలి అంటే దేశంలోని ప్రతి పౌరుడు విద్యావంతుడు అవ్వడం వల్లనే అది సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులందరికి పండిట్ జవహర్లాల్ నెహ్రూ పుట్టిన రోజునే బాలల దినోత్సవంగా నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ స్వయం పాలన దినోత్సవం ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభతో పాటు విద్య మెరుగుపడతాయని, తద్వారా భవిష్యత్తులో రాణిస్తారని అన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల సిబ్బంది సిస్టర్ డామరీష్, ప్రశాంతి, ఉపాధ్యాయులు షమిమ్, జ్యోతి, సహన, శిరోమణి, సింధు, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండల పరిధిలోని గ్రామాలలో ఉన్నటువంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు నెహ్రూ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పాఠశాలలు విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ పాఠశాలలో పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నెహ్రూకి పిల్లలు అంటే చాలా ఇష్టమని నెహ్రూ కూడా బాల్యంలో ఎక్కువ పుస్తకాలు చదువుతూ తన బాల్య జీవితాన్ని గడిపే వారని తెలిపారు. పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించడం వలన పిల్లల్లో ఉన్నటువంటి నైపుణ్యత ప్రతిభను కనబరిచే విధంగా ఈకార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సహకార వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** వారం రోజులపాటు జరిగే సహకార వారోత్సవాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిసిఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సహకార వారోత్సవాలలో బాగంగా కార్యాలయం ముందు శుక్రవారం సహకార పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా రైతాంగ అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారని తెలిపారు.దేశంలో సహకార వ్యవస్థ పటిష్టంగా ఉందన్నారు. రైతులు సహకార వారోత్సవాలలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాని కోరారు.ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు బుడగం రామమోహనరావు, చౌగాని ఆపారావు, సామ జనార్ధన్ రెడ్డి, యర్రంశెట్టి మధుసూధన్‌రావు, సిఈఓ ప్రసాదరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల కేంద్రంలోని సాయి ఎక్స్ లెంట్ విద్యాలయంలోని శుక్రవారం పాఠశాల డైరెక్టర్ అరెబోయిన నాగలక్ష్మి , శివకుమారి అధ్యక్షతన బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారత మొదటి ప్రధాని పండిత జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి బోధన చేశారు. చిన్నారులకు చిత్రలేఖనం, ఆట పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ భారత తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ జన్మదినం పురస్కరించుకొని ప్రతి ఏటా నవంబర్ 14న బాలల దినోత్సవం జరుపుకుంటామని గుర్తు చేశారు. బాలల దినోత్సవం ప్రాముఖ్యత గురించి వివరించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

## జెడ్పి పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ



**ప్రజాపక్షం/గుండాల :** బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రముక వ్యాపార వేత్త, ఆర్యవైశ్య సంఘ మండల అద్యక్షులు మానాల వెంకటేశ్వర్లు ఆద్వర్యంలో 25వేల విలువ గల సౌండ్ సిస్టం జెడ్పి పాఠశాలకు వితరణ చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్ధులు చదువు పట్ల నిర్లక్ష్యం చేయకుండా శ్రద్ధతో చదుకోవాలని , ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని అన్నారు. అలాగే చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలకు తన వంతు సహకారాన్ని అందించేందుకు కృషి చేస్తానని హామి ఇచ్చారు. ప్రదానోపాద్యాయురాలు పార్వతమ్మ , ఉపాధ్యాయులు , విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఈ సందర్భంగా మానాల వెంకటేశ్వర్లను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు మానాల శావన్, మానాల ప్రభాకర్, టి నాగరాజు, టి రాంబాబు, ఎస్ శ్రీనివాస్, టి వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి చట్టాలను పకడ్బందిగా అమలు చేయాలి



**ప్రజాపక్ష/గుండాల :** ఏజెన్సీలో ఆదివాసిల చట్టాలను పకడ్బందిగా అమలు చేయాలని ఆదివాసి సంక్షేమపరిషత్ జిల్లా అధ్యక్షులు వాగబోయిన చంద్రయ్య శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండల పరిదిలోని వలస గిరిజనేతరుల ఆదీనంలో ఉన్న భూములను ప్రభుత్వం స్వాదీనం చేసుకొని, వారిపై ఎల్‌టిఆర్ కేసులను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సరిహద్దు లలోగల రాష్ట్రాల నుండి తెలంగాణలోని మైదాన ప్రాంతాలనుండి గిరిజనేతరులు, లంబాడీలు మండాలానికి విచ్చేసి 1/70కి విరుద్ధంగా భూములకు అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేసి బహుల అంతస్తులను నిర్మించి ,వడ్డివ్యాపారాలను నిర్వహిస్తున్న అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడంపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వలస వాదులను అరికట్టాలని డిసెంబర్ 2న మండల తహసీల్దారు కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో సంఘనాయకులు పి మహేష్, జి సుదాకర్, జె సుదాకర్, పి వసంత్, టి పాపరావు, టి కిరన్, ప్రశాంత్ ఉన్నారు.

## ట్రాక్టర్ బోల్తా.. కూలి మృతి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండలంలోని గొందిగూడెం గ్రామ పంచాయితీ పరిధిలో ఇటుక బట్టీల సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడి బట్టీల ఆదివాసి కూలి మృతి చెందాడు. ఈవిషయంపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రమాదం జరిగిన సంఘటనలో ట్రాక్టర్ బోల్తా పడి ఉండటంతో కాలినడకన వెళ్లే వారి సమాచారంతో అక్కడకు వచ్చిన పోలీసులు జేసీబీతో మృతదేహాన్ని ట్రాక్టర్ క్రింద నుండి తీయించి మృతుడి వివరాలు తెలుసుకొని అతడు ఒడిశా నుండి వచ్చిన వలన ఆదివాసి జీత్తు అని, బట్టి యజమాని వద్ద కూలిగా చేస్తున్నాడన్నారు. ప్రమాద శాత్తు ట్రాక్టర్ బొల్తా పడి, అక్కడిక్కకడే మృతి చెందడం జరిగిందని తెలిపారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం కొరకు మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

# ఘనంగా పాఠశాలల్లో బాలల దినోత్సవం








**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మాజీ ప్రధాని, దివంగత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఖమ్మం నగరంలోని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

### స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో...

బాలల దినోత్సవాన్ని ఖమ్మం నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి కె. శ్రీరాం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### బ్లూమింగ్ మైండ్స్ పాఠశాలలో :

ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్ మైండ్స్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్వయం పాలన దినోత్సవం, ఫుడ్ ఫెస్ట్ నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పి. అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### త్రివేణి పాఠశాలలో...

జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని త్రివేణి పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఫ్యాన్సీ డ్రెస్, నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్రచౌదరి, యర్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సిఆర్‌వో మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

### రెజొనెన్స్ శ్రీనగర్‌లో...

ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల రెజొనెన్స్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలతో పాటు పిక్నిక్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్తీక మాసం సందర్భంగా విద్యార్థులంతా వనంలోకి వెళ్లి సరదాగా ఆట పాటలతో సందడి చేశారు.ఈ కార్యక్రమంలో కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి, ప్రిన్సిపాల్ మురళీమోహన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### సర్వజ్ఞ పాఠశాలలో...

ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్ర పటానికి పాఠశాల డైరెక్టర్ ఆర్‌వి నాగేంద్రకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్‌విఎం పాఠశాలలో...

ఖమ్మం నగరంలోని ఎస్‌విఎం సెంట్రల్ పబ్లిక్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి డా॥ నవీనా మమార్, డైరెక్టర్ కిషోర్, అకాడమీక్ ఇంచార్జి ఉమశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు సందడి చేశారు.

## జూబ్లీహిల్స్ ప్రజల తీర్పు బిఆర్‌ఎస్ అహంకారానికి చెంప దెబ్బ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** జూబ్లీహిల్స్ ప్రజల తీర్పు బిఆర్‌ఎస్ అహంకారానికి చెంప దెబ్బవంటిదని డిసిసి మైనార్టీ సెల్ ఛైర్మన్ మహమ్మద్ ఖాన్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జూబ్లిహిల్స్ ఎంఎల్‌ఏ ఉప ఎన్నిక గెలుపుపై బూర్గంపాడు మండల సారపాక ప్రధాన కూడలిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుగ్గంపూడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టపాసులు కాల్చి కేక్ కట్ విజయోత్సవ వేడుకలు జరిపారు. ఈసందర్భంగా మహమ్మద్ ఖాన్, దుగ్గంపూడి కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందడంతో ఎంతో ఆనందంగా ఉందన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ తరపున ఎంఎల్‌ఏగా పోటీ చేసిన సునీతపై సుమారు 25వేల చిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొందడం కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి ప్రజలు ఓట్లు వేశారని గుర్తు చేశారు. బిఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేయడం తప్ప అభివృద్ధికి సహకరించడం లేదన్నారు. రాబోచే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ డంకా మోగించడం ఖాయమని అన్నారు. ఈకార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు బెల్లంకొండ వాసు, మాజీ మండల అధ్యక్షులు పూలపల్లి సుధాకర్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, రహీం ఖాన్, తిరుపతి చంటి, దామోదర్‌రెడ్డి, ప్రభాకర్, లాలయ్య, అనిల్, కిరణ్, నరసింహారావు, ఉండేటి వెంకన్న, కోట నాగిరెడ్డి, వరుసు సైదులు, మాచర్ల శ్రీను, చందు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలో ఘనంగా బాలల దినోత్సవం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కిన్నెరాస్టీల్ అంగన్వాడీ సెంటర్‌లో బాలల దినోత్సవం శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ అంగన్‌వాడీ కేంద్రం చిన్నారుల ఆట పాటలతో కళకళ్లాడింది. చిన్నారులు తమ టీచర్లకు పాటలు, నాటికలు, కవితలతో టీచర్లకు శుభాకాంక్షలు తెలిపారు. చిన్న పిల్లలు కల్మషం లేని మాటలు టీచర్లను ఆధ్యాంతం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా హాజరైన తల్లిదండ్రులు పిల్లల ఆటపాటలను చూసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన చుంచుపల్లి సెక్టార్ సూపర్వైజర్ సీత టీచర్ల సేవలను కొనియాడారు. చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదలలో అంగన్వాడీ టీచర్ల పాత్ర కీలకం అన్నారు. పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలు రెండో దేవాలయం వంటివని అన్నారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కిన్నెరస్టీల్, వెంకటేశ్వరా కాలనీ, రామాంజనేయ కాలనీ 1,2 టీచర్లు గుణమ్మ, రజని, సావిత్రి తో పాటు ఆయాలు , తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మినేని తనయుడు రమేష్ మృతి



**ప్రజాపక్షం/బోనకల్‌:** మండలంలోని రాయన్న పేట గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు, విజయ డైరీ మాజీ ఛైర్మన్ బొమ్మినేని హన్మంతరావు తనయులు బొమ్మినేని రమేష్ కాలేయ వ్యాధితో శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యు లు తూము రోషన్‌కుమార్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన అంత్యక్రియలు శనివారం రాయన్నపేటలో కుటుంబీకులు నిర్వహించనున్నారు. అంత్యక్రియలలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొననున్నారు. నివాళులర్పించిన వారిలో శాఖ కార్యదర్శి ఏలూరి పూర్ణచంద్రరావు, సీనియర్ నాయకులు వల్లెబోయిన జానయ్య, వల్లెబోయిన వీరభద్రం, తోటపల్లి ఆనందరావు, మరీదు వెంకటేశ్వర్లు, మరీదు ఈశ్వరమ్మ, ఏదుళ్ల సత్యం, మరీదు హన్మంతరావు, వడ్డెబోయిన సావిత్రి పాల్గొన్నారు.

## వివిసి, విఆర్‌ఏ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వివిసి, విఆర్‌ఏ ట్రస్టు ద్వారా విస్తృత సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివిసి, విఆర్‌ఏ సంస్థల ఛైర్మన్ వివి రాజేంద్రప్రసాద్ తెలిపారు. వివిసి, విఆర్‌ఏ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ స్వర్గీయ వంకాయలపాటి రమణప్రసాద్ 62వ జయంతి వేడుకలను శుక్రవారం మమత రోడ్డులోని వివిసి గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ట్రస్టు ఛైర్మన్ వివి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిసి, విఆర్‌ఏ ట్రస్టు ద్వారా ప్రతి ఏడాది పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్థలో పనిచేసే ప్రతి ఉద్యోగికి ఎల్లప్పుడు సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. కమ్మ మహాజన సంఘం ఖమ్మంకు వివిసి ట్రస్టు ద్వారా లక్ష రూపాయలు చెక్కును విరాళంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొల్లు రఘు సత్యనారాయణ, చావా రాము లకు అందజేశారు. అదేవిధంగా వివిసి ట్రాక్టర్ (జాన్ డీయర్) షోరూం నందు పని చేస్తున్న కాసాని సతీష్ గత నెలలో ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అతనికి ట్రస్టు ద్వారా లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని రాజేంద్రప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు బాధ్యులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెకానిక్ యూనియన్ తరుపున రూ. 10వేలు అందజేత



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మెకానిక్ కుమార్తె వివాహానికి ఖమ్మం టూ వీలర్స్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో రూ. 10వేలను కానుకగా అందజేశారు. పాండురంగాపురంకు చెందిన షేక్ అబ్బాస్ సలీమా దంపతుల కుమార్తె సుహానా పెళ్లి సందర్భంగా యూనియన్ తరుపున శుక్రవారం రూ. 10వేలను యూనియన్ అధ్యక్షులు వంగాల కొండలరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ మెకానిక్ కుటుంబాల్లో ఆడపిల్ల పెళ్లికి యూనియన్ తరుపున రూ. 10వేలు కానుకగా అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రూ.1.20 లక్షలు అందజేశామన్నారు. యూనియన్‌లో సభ్యత్వం కలిగిన ప్రతి మెకానిక్‌కు అండగా ఉంటున్నామన్నారు. ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో బుల్లెట్ అన్వర్, మురళి, నాగేశ్వరరావు, నాగరాజు, వెంకటేష్, సత్యం, సుబాని, నాగులమీరా, ఖుషీద్, నర్సింహారావు, వెంకట్రావు, మెకానిక్ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయగ్రంథాలయ వారోత్సవాలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని మద్దులపల్లిలో గల తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల ఖమ్మం నందు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌ఆర్ అండ్ బిజిఎన్ఆర్ కళాశాల నుండి డాక్టర్ పి.విజయ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గ్రంథాలయ విశిష్టతను, ఆ రంగంలో విజయం సాధించడానికి ఉన్న అవకాశాలను గురించి విద్యార్థులకు తెలియజేశారు. తొలుత అక్కడ ఏర్పాటు చేసిన ఎస్‌ఆర్ రంగనాథన్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సునీత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సునీత, లైబ్రరీ సైన్స్ అధికారి డి. ఆశాజై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వాలన చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా జవహర్ లాల్ నెహ్రూ జయంతి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సారపాక ప్రధాన కూడలిలో స్వతంత్ర భారతదేశ మొట్టమొదటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 136వ జయంతి వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ భారతదేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 1889 నవంబర్ 14 న జన్మించారని, 17 సంవత్సరాలు సుదీర్ఘకాలం ప్రధానమంత్రిగా చేసిన తొలి వ్యక్తి అని కొనియాడారు. అలీనోద్యమ, పంచశీల రూప శిల్పి అని భారతరత్న పొందిన తొలి ప్రధాని అని, నెహ్రూకి పిల్లలు అంటే ఇష్టం కనుక ఆయన పుట్టిన రోజును బాలల దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో పినపాక నియోజకవర్గం బి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బెల్లకొండ వాసుదేవరావు, బూర్గంపాడు మండల మాజీ అధ్యక్షులు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, నాయకులు గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఓర్సు సైదులు, ఎం శ్రీను, సయ్యద్ కరీం, నాగోతు భాస్కర్, రిటైర్డ్ ఉద్యోగులు కావూరి హనుమంతరావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 882 చెరువులు.. 3.48 కోట్ల చేప పిల్లలు..!



**మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు : జిల్లా మత్స్యశాఖాధికారి జీ.శివప్రసాద్**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జిల్లాలో మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా మత్స్యశాఖాధికారి జీ.శివప్రసాద్ పేర్కోన్నారు. మండలం లోని చెరువుమాధారం చెరువులో శుక్రవారం చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని మత్స్యకారుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 882 చెరువులలో 3.48 కోట్ల చేప పిల్లలను వదిలేందుకు కార్యచరణ ను రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 202 చెరువులలో 65 లక్షల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. కట్ల, రవ్వు, మరిగాల చేప పిల్లల రకాలు అందిస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారుల ఆర్థిక స్వాలంభన అందిస్తున్నట్లు తెలిపారు.మత్స్యకారుల ఆర్థిక స్వాలంభన సాధించేందుకు ప్రభుత్వం చేప పిల్లలను అందిస్తున్నట్లు తెలిపారు. నేలకొండపల్లి చెరువులో 5.34 లక్షల పిల్లలను వదిలినట్లు పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు కోటేశ్వరరావు ,భాను ప్రసాద్, చెరువుమాధారంమత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు యం.డీ. ఖాసిం, ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, డైరెక్టర్లు బలరాం, శేషయ్య, మస్తాన్, రోశయ్య. వి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతోనే విద్యార్థులకు గొప్ప ఆలోచనలు

**ప్రజాపక్షం/చర్ల :** విద్యార్థులకు గొప్పగొప్ప ఆలోచనలు తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల ద్వారానే వస్తుంటాయని ఎంఇఓ పరిటాల వెంకటరమణ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక గురుదేవ్ విద్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా భారత తొలి ప్రధాని నెహ్రూ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు హెచ్ జివి ప్రసాద్, అకడమిక్ కో ఆర్డినేటర్ ఎం వి సుబ్రహ్మణ్యం, జీ శ్రీనివాస్‌తో కలిసి ఆయన పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుల పట్ల శ్రద్ధ చూపాలని, చక్కగాచదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకుని బంగారు భవిష్యత్‌తో జీవిస్తారని, అదే విధంగా ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తమ వంతు పాత్ర తప్పని సరిగా పోషించాలని తెలిపారు. చిన్నారులు ఇతరులకు సహాయం చేలాని తలంపులు చిన్నారులకు రావడం ఎంతో గొప్ప విషయం అని,




10వ తరగతి విద్యార్థులంతా కలిసి పారిశుధ్య కార్మికులతో పాటు పాఠశాల ఆయాలు, బస్సు డ్రైవర్లు, పారిశుధ్యపనులు చేపట్టే వారిని సత్కరించి చలికోట్లు బహుమతిగా ఇచ్చారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# మైలారం పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మైలారం పాఠశాలలో విద్య నభ్యసిస్తున్న బాలబాలికలకు జాతీయ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసంగించారు. పండిట్ జవహర్లాల్ నెహ్రూ జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకోవడం ద్వారా పిల్లలుపైన ఉన్న ప్రేమ, శ్రద్ధ వారి అభివృద్ధిపై ఉన్న అంకిత భావన్ని గుర్తు చేసుకుంటామని, పాఠశాల చిన్నారుల సర్వాంగీణ అభివృద్ధి కోసం నాణ్యమైన విద్య సురక్షితమైన వాతావరణం, సృజనాత్మకతను వెలికి తీసే కార్యకలాపాలు, నైతిక విలువలను పెంపొందించే బోధన



అందించడానికి కట్టుబడి ఉంటుందన్నారు. ప్రతి చిన్నారి ఒక వెలుగు, ఆ వెలుగును మరింత ప్రకాశవంతం చేయడానికి మా పాఠశాల నిరంతరం కృషి చేస్తుందన్నారు. పిల్లల ఆనందం, ఆరోగ్యం అభివృద్ధి మా ప్రధాన లక్ష్యమని తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంఅ చిన్నారులందరూ చిరునవ్వులతో కొత్త ఆశయాలతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల సహోపాధ్యాయులు జి కుమార్ రాజా, అంగన్వాడీ టీచర్ బాయమ్మ, ఆయా సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండల పరిధిలోని ఎర్రగుంట, రజబలినగర్ పాఠశాలలను జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజ శేఖర్ సందర్శించారు. జవహర్ లాల్ నెహ్రూ జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ సూచనల మేరకు నిర్వహించిన ప్రత్యేక తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాలను పరిశీలించారు. ఈ సమావేశాలకు




తల్లిదండ్రులు విధిగా హాజరై, విద్యార్థుల ప్రగతిని తెలుసుకోవాలని తెలిపారు. సమావేశం అనంతరం రాజబలినగర్ గుతికోయ ఆవాస ప్రాంతంలో ఉన్న మండల పరిషత్ పాఠశాలను మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్‌తో కలిసి అక్కడ బాలల దినోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. తదుపరి విద్యార్థులకు డ్రాయింగ్ పుస్తకాలను, రంగు పెన్సిల్లను, లైబ్రరీ పుస్తకాలను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలు బాగా చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. మండలంలోని చాలా పాఠశాలలో స్వయం పాలనా దినోత్సవాన్ని జరిగిందని మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్ తెలిపారు. ఈకార్యక్రమాలలో ఎర్రగుంట విద్యార్థుల తల్లిదండ్రులు, రజబలినగర్‌లో ఆవాస నివాసి మహేష్, ఎర్రగుంట ఉపాధ్యాయులు బి వెంకటేశ్వరరావు, లకవాత్ జయరాం పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ గెలుపుపై సంబురాలు

**ప్రజాపక్షం/చండ్రుగొండ:** హైదరాబాద్‌లో జూబ్లిహిల్స్ ఎంఎల్‌ఏ ఉప ఎన్నిక గెలుపుపై మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక ప్రధాన సెంటర్‌లో నాయకులు స్వీట్లు పంపిణీ చేసి, బాణాసంచ పేల్చి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందడంతో ఎంతో ఆనందంగా ఉందన్నారు. బిఆర్ఎస్ పార్టీ తరపున ఎంఎల్‌ఏగా పోటీ చేసిన సునీతపై సుమారు 25వేల చిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొందడం కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి ప్రజలు ఓట్లు వేశారని గుర్తు చేశారు. బిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేయడం తప్ప అభివృద్ధికి సహకరించడం లేదన్నారు. రాబోచే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ డంకా మోగించడం ఖాయమని అన్నారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోవింద్‌రెడ్డి,



గ్రామ శాఖ అధ్యక్షులు తుమ్మలపల్లి సురేష్, నాయకులు బోజ్యనాయక్, సారేపల్లి శేఖర్, కేశబోయిన నరసింహారావు, అశ్వారావుపేట నియోజకవర్గ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ప్రజల్ బక్ష, రామారావు, కోటేశ్వరరావు, సంక శంకర్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# నేడు భద్రాద్రిలో మంత్రి లక్ష్మణ్ కుమార్ పర్యటన



**ప్రజాపక్ష/భద్రాచలం :** రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి, గిరిజన, మైనార్టీ, వికలాంగులు, వయోవృద్ధులు, లింగమార్పిడి వ్యక్తుల సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ నేడు భద్రాచలంలో పర్యటించనున్నారు. మంత్రి మధ్యాహ్నం 1 గం.లకు బూర్గంపాడు మండలంలోని ఐటిసి పిఎస్‌పిడి అతిథి గృహానికి చేరుకునే ఆయన మధ్యాహ్నం 2 గం.లకు ఐటిడిఏలోని గిరిజన భవన్‌లో రాష్ట్రస్థాయి జన్ జాతీయ గౌరవ దివస్, భగవాన్ బిర్స ముండా 150వ జయంతి వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5 గం.లకు ఐటిడిఏ సమావేశ మందిరంలో ఐటిడిఏ సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో ప్రత్యేక సమావేశఆన్ని నిర్వహిస్తారు.

# ఆర్ఎంపీ వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఆర్ఎంపీ వైద్యుడి వేధింపులు తాళలేక పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద సంఘటన రేలకాయలపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈవిషయంపై వివరా లు ఇలా ఉన్నాయి. రేలకాయలపల్లి గ్రామానికి చెందిన జరుపల సందీప్తి(20)ఆ పరిసర గ్రామాల్లో ఆర్ఎంపి వైద్యుడిగా పని చేసే నామ నరేష్ గత కొంత కాలంగా ఒకరినొకరు ఇష్టపడ్డారు. వీరి ప్రేమ వ్యవహారం యువతి ఇంట్లో తెలియడంతో తల్లిదండ్రులు ఆమెను కళాశాలకు పంపకుండా ఇంటి వద్దే ఉంచారు. భయంతో ఆర్ఎంపి వైద్యుడు పరారై అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. కాగా తల్లిదండ్రులకు భయపడకుండా తనను పెళ్లి చేసుకోవాలని సందీప్తిని ఆర్ఎంపి అడగగా ఆమె నిరాకరించింది. దీంతో ఇద్దరు కలిసి చనువుగా ఉన్నప్పుడు దిగిన ఫోటోలను ఆర్ఎంపి వైద్యుడు నరేష్ తన స్టేటస్‌గా పెట్టుకోవడమే కాకుండా ఇతర సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీంతో తన తల్లిదండ్రులతో కలిసి యువతి ఈనెల 6వ తేదీన కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆర్ఎంపిపై ఫిర్యాదు చేసింది. ఫోటోలు ప్రచారం చేయడం వల్ల తన, తన కుటుంబం పరువు పోయిందని భావించి ఈనెల 13న ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతి పురుగుల మందు తాటి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందింది.

# నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రావరం చిన్నారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాబూ




క్యాంప్ హైస్కూల్లో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంల జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యాతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్కినేని మాట్లాడుతూ భారతదేశ తొలి ప్రధాని పండింట్ జవహర్ లాల్ నెహ్రూకు చిన్న పిల్లలు అంటే ఎంతో ఇష్టమని, నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని, దేశ భవిష్యత్ అంతా వారి చేతుల్లోనే ఉందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను సరైన మార్గంలో నడిపించాలని, ప్రధానంగా బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని, బాలల హక్కులు చట్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు రాజమల్లు, లీగల్ ఎయిట్ కౌన్సిల్ పి నిరంజన్, ప్రధానోపాధ్యాయురాలు నీరజ, అడ్వకేట్ మారపాక రమేష్, పారా లీగల్ వాలంటీర్ బి రాజమణి, ఉపాధ్యాయులు దస్తగిరి, చందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో జూబ్లీహిల్స్ విజయోత్సవం

**ప్రజాపక్షం/భద్రాచలం :** జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిచడంతో కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం భద్రాచలంలో విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై కేరింతలు కొట్టారు. ఇందులో భాగంగా టిపిసిసి సభ్యులు బుడగం శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇదే సీన్ రిపీట్ అవుతుందని అన్నారు. ప్రతిపక్ష బిఆర్ఎస్ ఎన్ని ఎత్తుగడలు వేసినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను జూబ్లీహిల్స్ ప్రజలు దీవించి బంపర్ మెజార్టీతో గెలిపించారని చెప్పారు.ఈ సంబురాల్లో కాంగ్రెస్ నాయకులు సరెళ్ల నరేష్, సత్యలింగం, వెంకటేష్, కృష్ణారెడ్డి, జిందా, శ్రీనివాస్, రాజు, సుధాకర్, గౌతమ్ సునీల్ పాల్గొన్నారు.



# ఘనంగా చిల్డ్రన్స్ డే వేడుకలు

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురంలోని ఎమిలీ పబ్లిక్ స్కూల్ నందు శుక్రవారం చిల్డ్రన్స్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు తామే ఉపాధ్యాయులుగా స్వయం పరిపాలన బోధన తరగతులను నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ములకలపల్లి గోపీనాథ్ మాట్లాడుతూ మన భారతదేశ మొట్టమొదటి ప్రధాని దివంగత జవహర్ లాల్ నెహ్రూ పుట్టిన రోజు సందర్భంగా ఆయన పుట్టినరోజు గుర్తుగా చిల్డ్రన్స్ డే వేడుకలను నిర్వహించుకోవడం చాలా సంతోషకరమని, పిల్లలే ఉపాధ్యాయులుగా బోధన చేయడం భావితరాలకు మనం ఏ ఆశయ సాధనంగా పని చేయాలో తెలిసే విధంగా వారికి వారే ఆలోచించే ఒక గొప్ప ప్రదేశమే పాఠశాల అని అన్నారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులుగా బోధన చేసిన విద్యార్థులను ఆశీర్వదించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయం




**-టీయుడబ్ల్యూజె (ఐజెయు)**
**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ**
**-ఐజెయులో చేరిన మాధవ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా టియుడబ్ల్యూజె (ఐజెయు )పని చేస్తుందని టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ తెలిపారు. అక్రిడెషన్లు, హెల్త్ కార్డుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుందని ఆయన ఆరోపించారు. సీనియర్ జర్నలిస్టు వై. మాధవరావు శుక్రవారం తన అనుచరులతో కలిసి టియుడబ్ల్యూజె (ఐజెయు)లో చేరారు. ప్రెస్క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు టియుడబ్ల్యూజె (ఐజెయు) బాధ్యులు సంఘ సభ్యత్వాన్ని అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాంనారాయణ మాట్లాడుతూ త్వరలో అక్రిడేషన్లు, హెల్త్ కార్డుల సాధనకు పోరాట కార్యాచరణ రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే పలువురు జర్నలిస్టులు అనారోగ్యంతో మృత్యువార్త పడ్డారని అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో క్యాష్‌లెస్ వైద్యం అందించేవిధంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులను జారీ చేయడంతో పాటు ప్రస్తుత గడువు ముగిసేలోగా అక్రిడేషన్లు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, నగర అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాస్, కార్యదర్శి జనార్థన్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నామ పురుషోత్తం, సంఘ బాధ్యులు ఏలూరి వేణుగోపాల్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# మాదిరిపురం గుట్టల్లో వ్యభిచారం

**లారీ డ్రైవర్లే టార్గెట్**
**పోలీసు తనిఖీలు నిర్వహించాలంటున్న స్థానికులు**





**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** మసక మసక చీకటిలో రాత్రి ఎలాగైన కలుసుకో మన సైనది దొరుకుతుంది అన్న సినీ రచయిత రాసిన మంచి ఉత్సాహాభరితమైన పాట విని ఆనందించాం. అదే తరహాలో తిరుమలాయపాలెం మండలంలో ఓ మహిళల ముఠా లారీ డ్రైవర్లను టార్గెట్ చేసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పలువురు లారీ డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని ఖమ్మం వరంగల్ జాతీయ రహదారిపై చందు తండా మాదిరిపురం మధ్యలో గల గుట్టల్లో రాత్రి సమయంలో లారీ డ్రైవర్లను మరిపెడ ప్రాంతానికి చెందిన కొందరు మహిళలు లారీలను ఆపి వారిని ముగ్గులోకి దింపి స్వరం దోచుకుంటున్నట్లు డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. మొదట ఆ డ్రైవర్లు మహిళలకు ఆకర్షితులై దగ్గరికి వెళ్లగానే మహిళలు తమ అందచందాలతో డ్రైవర్లను రెచ్చగొడుతూ పూర్తిగా వారి కంట్రోల్‌లోకి తీసుకుని ఆసయమంలో వారి వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నం చేసి డ్రైవర్లను మహిళల తరుపున ఉన్న మగవారితో బెదిరించి దాడికి పాల్పడతున్నారని ఆరోపిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాల క్రితం ఇదే తరహాలో ఆ ప్రాంతంలో ఓ మహిళ బావిలో పడి మృతి చెందగా ఆ మృతి పై పోలీసులు విచారణ చేయగా తోర్రూర్ ప్రాంతం వారిగా గుర్తించి వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్ చేసిన సంఘటన చోటు చేసుకుంది. అదే తరహాలో ఆ ప్రాంతంలో తరచూ ఇలాంటి సంఘటనల జరుగుతున్నాయని డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. దీనంతటికీ కారణం పోలీసులు రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహించకపోవడం, పోలీస్ నిఘా వ్యవస్థ లేకపోవడం, సిసి కెమెరాలు ప్రధాన కూడల్లో పనిచేయకపోవడమేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. మాదిరిపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 189 ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయని నిర్మానుష ప్రాంతం కావటం ఇలాంటి కార్యక్రమాలకు ఆద్యం పోస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరిపెడ, తిరుమలాయపాలెం పోలీసులు నిఘా వ్యవస్థను పెంచి పెట్రోలింగ్ నిర్వహిస్తే ఇలాంటి కార్యక్రమాలకు తావుండదని భావిస్తున్నారు. మహిళల నుండి మోసపోయిన డ్రైవర్లు పోలీస్ కేసు పెట్టలేక పరువుతో తమ ఆవేదనను వెల్లబుచ్చుతున్నారు.

# పెరుగుతున్న చలి పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/కల్లూరుః** పెరుగుతున్న చలి తీవ్రత పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు నవ్య కాంత్ ప్రజలను కోరారు. ప్రజలు చలికాలం మూడు నెలలు పట్ల పలు జాగ్రత్తలు తీసుకోవాలని చలి తీవ్రత క్రమంగా పెరుగుతోందని ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయని రాత్రివేళ పొగ మంచుతో కూడిన గాలులు వీస్తున్నాయని రానున్న రోజుల్లో తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉండటంతో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నట్లు వైద్యులు నవ్య కాంత్ ప్రజలకు సూచిస్తున్నారు. గ్రామాల్లో ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, పర్యవేక్షకులు ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జలుబు, దగ్గు ,జ్వరం, శ్వాసకోస సంబంధిత సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని ఈ నేపథ్యంలో ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఎందుకన వారిలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. చలికాలంలో వచ్చే వ్యాధులు చలి కారణంగా జ్వరం, ఒంటిపై దద్దుర్లు, రావచ్చు దగ్గు ,ముక్కు కారడం, శ్వాస సంబంధిత సమస్యలు గొంతు నొప్పి, తుమ్ములు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి లక్షణాలు ఉన్న చిన్నారుల ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ ఏర్పడి నిమోనియా బారిన పడే అవకాశం ఉందని గాలి ద్వారా సూక్ష్మ క్రిములు శరీరంలోకి ప్రవేశించి కణాలను నిర్వీర్యం చేయడంతో రోగనిరోధక శక్తి తగ్గుతుంది కాబట్టి ప్రజలు చలికాలంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. ప్రజలు కు సలహాలు, సూచనలకు వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు అందుబాటులో ఉన్నామని ఆరోగ్యం పట్ల అప్రమత్తతో ఉండాలని ప్రజలకు సూచిస్తున్నారు.

# బదిలీ కార్మికునికి మేవా కమిటీ ఆర్థికసాయం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సారపాక గ్రామానికి చెందిన ముస్లిం ఎంపవర్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్(మేవా) వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అశ్వాపురం మండలం అమెర్ద గ్రామానికి చెందిన ఐటిసి పిఎస్పిడిలో బదిలీ కార్మికునిగా పని చేస్తున్న ఇరుగు సాంబశివరావు వైద్య ఖర్చు కోసం రూ 10వేల ఆర్థిక సహాయం అందించారు. ఇరుగు సాంబశివరావు పేపర్ మిషన్ 1ఏలో ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ బదిలీ కార్మికునిగా పని చేస్తున్నారు. ఇటీవల ఇతనికి ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ అయిందని, గత కొంతకాలంగా అతని ఆరోగ్య పరిస్థితి బాగాలేక కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకువెళ్ళడం అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించగా, ఊపిరితిత్తులు క్యాన్సర్ అని తేలడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడ చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన చికిత్సకు అధిక వైద్య ఖర్చులు అవసరమవుతున్నాయి విషయం తెలుసుకున్న మేవా వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఇరుగు సాంబశివరావుని వారి కుటుంబ సభ్యులను ఓదార్చి మేవా వెల్ఫేర్ సొసైటీ తరపున రూ 10వేల ఆర్థిక సహాయంను అందజేశారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ సాంబశివరావు మా అందరికితో కలిసి పని చేస్తూ అందరికితో ఎంతో కలవిడిగా ఉంటూ అందరి నవ్విస్తూ పలకరించే వాడని అతను త్వరగా కోలుకొని మళ్లీ డ్యూటీకి వచ్చి మాతో కలిసి పని చేయాలని ఆ అల్లా సుభానుతాలను కోరుకుంటున్నామన్నారు. ఈకార్యక్రమంలో అధ్యక్షులు మహమ్మద్ ముస్తాఫా, కమిటీ సభ్యులు మొహమ్మద్ సోహల్ పాషా, నాగూర్ వలీ(బాబా), అబ్దుల్ అజీజ్, మొహమ్మద్ రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన వెరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



**ప్రజాపక్షం/వైరాః** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సందర్భంగా వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ సిఎం క్యాంపు కార్యాలయంలో సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిసి జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల విషయాలను చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్‌తో పాటు కోనేరు చిన్ని, వైరా నియోజకవర్గ నాయకులు వైరా మండల కాంగ్రేస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, కొణిజర్ల మండల కాంగ్రేస్ అధ్యక్షులు వడ్డే నారాయణరావు, వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రేస్ మాజీ అధ్యక్షులు పమ్మి అశోక్, నాగ సీతారాములు, బోడా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం మీద నమ్మకమే కాంగ్రేస్ గెలుపు



**ప్రజాపక్షం/కారేపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం మీద నమ్మకమే కాంగ్రేస్ పార్టీ గెలుపు అని కాంగ్రేస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు మంజుల, మండల కాంగ్రేస్ అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్‌లు అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లో కాంగ్రేస్ గెలపు పట్ల సింగరేణి మండల కేంద్రంలో విజయ సంబురాలు చేసి, బాణాసంచాలు పేలుస్తూ, స్వీట్‌లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ గెలుపు అక్కడ కాంగ్రేస్ పార్టీ కార్యకర్తలు చేసిన కష్టం, ప్రచారంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలే గెలిపించాయని అన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్‌లు రాజకుమార్, జగన్నదాం, నర్సయ్య, సొసైటీ డైరెక్టర్‌లు హిరలాల్, ఐలయ్య, ఉపేందర్, మాజీ సర్పంచ్ భద్రు, మాజీ ఎంపీటీసీలు రాంచందర్, వెంకటేశ్వర్లు, కోఆప్షన్ సభ్యులు హనీఫ్, బాబు, టౌన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, సట్టు వీరభద్రం, సంతోష్, గాంధీ నాగేశ్వరరావు, శ్రీను, షఫీ, పేరు యాకుబ్ జానీ, షబ్బీర్, తాజుద్దీన్, సక్రు పాల్గొన్నారు.

# వివాహిత మృతి

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండలం పెద్ద కోరుకొండి గ్రామానికి చెందిన బండి నాగమణి (26 )భర్త శ్రీను వాసరావు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేయడంతో నాగమణి గురువారం మృతి చెందినట్లు తల్లి ఫిర్యాదు మేరకు ఆమె భర్త బండి శ్రీనివాసరావు అత్త తిరుపతమ్మలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిత తెలిపారు. ఈ సంఘటనా స్థలాన్ని ఎస్సై, సీఐ, ఎసిపిలు పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

# కాంగ్రేస్ శ్రేణుల విజయోత్సవ సంబురాలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ ః** ఖమ్మంరూరల్ మండలంలో కాంగ్రేస్ పార్టీ ఆధ్వర్యంలో జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలలో విజయం సాధించడం పట్ల విజయోత్సవ సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులను కాల్చి జై కాంగ్రేస్, జై పొంగులేటి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కళ్లెం వెంకట్‌రెడ్డి, మద్ది వీరారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, గార్ల రాజశేఖర్, బత్తుల ప్రసాద్, వెంకన్న, బత్తిని యాలాద్రి, కిరణ్, మహేష్, ఆడెపు ఆంజనేయులు, అంజి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# వైరా విద్యుత్‌శాఖ ఇంచార్జిగా చిన్న బాబురావు



**ప్రజాపక్షం/వైరాః** వైరా విద్యుత్‌శాఖ డివిజనల్ ఇంజనీర్(ఎఫ్ఏసి)గా ఖమ్మం సర్కిల్ కార్యాలయంలో టెక్నికల్ డిఈగా పనిచేస్తున్న శుక్రవారం వైరా విద్యుత్‌శాఖ డిగీగా వి.బాబురావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులకు, నాణ్యమైన విద్యుత్ అందించడానికి కృషి చేస్తానని తెలియజేశారు. ఇప్పటివరకు వైరా విద్యుత్‌శాఖ డిఈగా పనిచేసిన బి.శ్రీనివాసరావు, కొత్తగా ఏర్పడిన మధిర డివిజన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎన్.రామారావు, డిఈ ఖమ్మం, వైరా ఏడిఈ పి.కిరణ్‌కుమార్, ఏఈఎస్‌పి సుందర్‌కుమార్, పి.వెంకటసాయి, డివిజన్ అకౌంట్ స్టాఫ్ శుభాకాంక్షలు తెలిపారు.

# న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో బాలల దినోత్సవం




**ప్రజాపక్షం/వైరాః** నెహ్రూ 136వ జయంతిని పురస్కరించుకొని న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ షాజీమ్యాథ్యూ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలను అలంకరించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

# పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించిన ఎంఇఓ

**ప్రజాపక్షం/కారేపల్లి:** మండల పరిధిలోని ఎంపీపీఎస్ బొక్కలతండ పాఠశాల నూతన భవనంను మండల విద్యాశాఖ అధికారి డి జయరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వ పాఠశాలలను ముందు ఉంటాయని తెలిపారు. ఈకార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ కోమట్లగూడెం ప్రధానోపాధ్యాయురాలు టి శారద, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి విజయలక్ష్మి , ఉపాధ్యాయులు వి మంగీలాల్, ఎల్ లక్ష్మ ణ్, బి రామకోటి, ఎమ్మార్సీ సిబ్బంది వి మోతిలాల్, ఎల్ రాములు, పరమేష్, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు రజనీకుమారి, ఏపీసీ ఛైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.